
"సైలెన్స్! సైలెన్స్!" తన మీద భయంకరమైన ఇనపసుత్తి పడబోతోందని తెలియని జడ్జిగారు చెక్క సుత్తితో బల్లమీద బాదారు. కోర్టు నడుస్తోంది. ఓ అమెరికా తెలుగు కుర్రాడు తన కూతుర్ని పెళ్ళి చేసుకుంటానని ఒప్పుకుని, ఆ దేశం నుంచి మందీమార్బలంతో కదలివచ్చి, తాను ఆకాశమంత పందిరీ, ఊరంత అరుగూవేసి దేశం నలుమూలల నుంచీ అతిథుల్నీ, స్నేహితుల్నీ ఆహ్వానించి పెళ్ళికి సిద్ధమయి ఉండగా, తెల్లారి పెళ్ళనగా ఈ రాత్రి ఆ పిల్లని పెళ్ళిచేసుకోనని పిచ్చి చేష్టలు చేసి తనకు అపారమైన ధననష్టాన్నీ, అనూహ్యమైన మాన నష్టాన్నీ కలగజేశాడని ఓ పెద్దమనిషి, రామనాథంగారు సదరు కుర్రాడిపై పెట్టిన పదిలక్షల పరువునష్టం కేసు విచారణలో ఉంది.


# కోర్టు తెల్లబోయింది!

**జంధ్యాల**



బోనెక్కిన అమెరికా తెలుగు కుర్రాడికేసి పరికించి చూశాడు జడ్జి. భారతీయ జాతీయ జెండాకి అమెరికన్ క్లాత్‌తో బోర్డర్ కట్టినట్టు - అమెరికన్ డ్రెస్‌లో మెరిసిపోతున్నాడు ఆ అచ్చ తెలుగు అబ్బాయి. కానీ - ఆ కళ్ళలో బెదురు, భయం స్ఫుటంగా కనిపిస్తున్నా కాని - కొండొకచో అవి పిచ్చిచూపుల్లా అనిపిస్తున్నాయ్ -

"సర్... నేను మిచిగన్ స్టేట్‌లో సైకియాట్రిస్ట్‌గా వర్క్ చేస్తున్నాను... ఇన్‌ఫాక్ట్... నేను పుట్టింది ఆముదాలవలసలో అయినా, పెరిగింది అమెరికాలోనే - మా నాన్నగారు స్టేట్స్‌లో సెటిలై ముప్పై ఏళ్ళయింది. ఊహ తెలిశాక నేను రెండుసార్లు ఇండియా వచ్చాను. నేను ఎనిమిదేళ్ళ వయసప్పుడు మొదటిసారి, పన్నెండేళ్ళ వయసప్పుడు రెండోసారి. ఇప్పుడు నా వయస్సు ఇరవైఏడు. సో... చివరిసారి నేను ఇండియా వచ్చి పదిహేనేళ్ళయింది. ఇదివరకు రెండుసార్లు ఇండియాలో ఏవేవో సినిమాలు చూశాను. కొన్ని చాలా బాగున్నాయి. కొన్ని యావరేజ్‌గా అనిపించాయి. మా ఫాదర్‌కి ఈ రామనాథంగారు తెలిసిన కారణంగా నాకు వీళ్ళ అమ్మాయిని ఆఫర్ చేశారు. ఫొటోలు చూశాను. నచ్చింది. ఓ.కె. అన్నాను. పెళ్ళి ఏర్పాట్లు చేశారు. పెళ్ళికి వారం ముందుగా నేను, మా ఫ్యామిలీ స్టేట్స్ నుంచి వచ్చాం. ఇక్కడికి వచ్చాక నాకు తెలిసింది. నూనె వ్యాపారం చేసే రామనాథంగారు ఈ మధ్య సినిమాలు తీశారని, ఇప్పుడు లేటెస్ట్‌గా ఓ సినిమా తయారవుతోందని, ఐ ఫెల్ట్ గ్లాడ్ బ్యాక్ హోం, మా మావగారు ఫిల్మ్‌మేకర్ అని గర్వంగా చెప్పుకోవచ్చని ఆనందించాను. పెళ్ళి ఏర్పాట్లు జరిగాయి. తాను తీసిన సినిమా ఫస్ట్ కాపీ వస్తుందని, మనం మాత్రమే చూద్దామని రామనాథంగారు నాకు చెప్పారు. తెల్లారితే పెళ్ళనగా ఆ కాపీ వచ్చింది. హోటల్ భాస్కర్ ప్యాలస్‌లో ప్రివ్యూ అన్నారు. జెట్‌లాగ్ ఇంకా తగ్గని కారణంగా మా పేరెంట్స్ రామన్నారు. నేను వెళ్ళాను - రామనాథంగారు నా పక్కనే కూర్చున్నారు. సినిమా ప్రారంభమైంది - ముందు పేర్లొచ్చాయి - ఆ తర్వాత బొమ్మ మొదలైంది.



ఒకావిడ ఖరీదైన నైలాన్ చీర కట్టుకుని కుట్టు మిషన్ మీద బట్టలు కుడ్తోంది. "ఆవిడ హీరో తల్లి, పాపం బీదది. బట్టలు కుట్టి బిడ్డల్ని పోషిస్తుంది" అన్నాడు రామనాథంగారు. "బీదదైతే నైలాన్ చీర కట్టుకుందేమిటి, నేతచీర కట్టుకోవాలి గదా" అన్నాను. "బిగ్ బడ్జెట్ కమర్షియల్ ఫిల్మ్ గదా... నేతచీర కడితే బాగుండదు" అన్నాడు రామనాథంగారు! కాస్సేపట్లో... హీనపక్షం నలుగురు పిల్లలకి తండ్రిలా అనిపించే ఓ ఆజానుబాహుడు నిక్కరేసుకుని "అమ్మా - నేను టెన్త్ ఫస్ట్‌క్లాస్‌లో ప్యానయ్యానమ్మా" అని వెకిలిగా నవ్వుతూ పరుగున వచ్చాడు - "ఆయనే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు - మన హీరో" అన్నాడు రామనాథంగారు.

ఇంతలో ఓ పదహారేళ్ళ పిల్ల పరుగున వచ్చి "నిజంగా ఫస్ట్‌క్లాస్‌లో ప్యానయ్యావా?" అంటూ హీరోని ఎముకలు విరిగేలా కావలించుకుంది. పుచికూ పుచికూ ముద్దులు పెట్టేస్తోంది - హీరో కూడా ఆ పిల్లని అప్పడాల పిండి ఉండని నలిపినట్టు నలిపేస్తున్నాడు - "ఆ అమ్మాయి హీరోయినా" అనడిగాను - "కాదు, హీరో సిస్టరు!" అని కోప్పడ్డాడు రామనాథంగారు. అన్నాచెల్లెళ్ళ మధ్య ప్రేమ ఉంటుందని నాకూ తెలునుగాని ఈ టైపు రాక్షస ప్రేమ ఉండడం ఆశ్చర్యమనిపించింది. మా చెల్లాయ్ నేను ట్వెల్త్ కాదు గదా, డిగ్రీ పాసయినప్పుడు కూడా 'కంగ్రాట్స్' అని ఊరుకుందే తప్ప షేక్‌హాండ్ కూడా ఇవ్వలేదు మరి! ఆ తర్వాత ఇంకో పధ్నాలుగేళ్ళ కుర్రాడు 'అన్నయ్యా' అని అరుస్తూ వచ్చి హీరోని కావలించుకున్నాడు. అంతవరకూ నవ్వుతూ చూస్తున్న ఆ తల్లి లేచి ఆనందబాష్పాలు కారుతూండగా ఆ ముగ్గురి మీదకీ జంప్‌చేసి కావలించుకుంది. ఎ.బి.సి.డి.ఇ.ఎఫ్. ఇది ఇంగ్లీషు... అఆఇఈఉఊ - ఇది తెలుగు. ఆతేహై జాతేహై హిందీ - ఇంగెవా అంగెపో అరవం - మనది సుఖమయ కాపురం... అందాల గోపురం..." అనే పాటని ఆ నలుగురూ జమిలిగా పెద్ద గొంతులేసుకుని పాడడం ప్రారంభించారు - షాక్ తిన్నాను - ఆ గోలేమిటని అడిగాను. అది ఫ్యామిలీ సాంగన్నారు రామనాథంగారు. అదే సెంటిమెంటన్నారు - సెంటిమెంటల్ సాంగ్ అయితే అందులో భారతీయ భాషా వివరాల జాబితా ఎందుకన్నాను - "అదే వెరైటీ" అన్నాడాయన సంబరపడిపోతూ - ఆ పాటని భరించాను సార్ - ఆ తర్వాత సీన్‌లో ఓ జామకాయలమ్ముకునే అమ్మాయి వస్తోంది. డ్రెస్ చాలా ఎక్స్‌పోజింగ్‌గా ఉంది. "వ్యాంపా" అనడిగాను. "ఛఛ-హీరోయిన్" అన్నాడాయన. హీరో ఎదురయ్యాడు - "జతకాయి" వెల ఎంత? అన్నాడు. చిలిపితనం అని భ్రమపడుతూ "మూడుముళ్ళు" అందా పిల్ల సిగ్గుతో తలదించుకుంటూ - "వచ్చివో కావో పట్టుకుని చూడనా?" అన్నాడు హీరో.

## జంధ్యాల - 'కిస్'

మైక్ దొరికితే వదలనివారు చాలా మంది ఉంటారు. సినిమా సభల్లోనూ ఇది మామూలే. ఈ మైకాసురుల్ని మందలిస్తూ ఔచిత్య సూత్రాలు అనుసరించడానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి, ఎం.ఎస్.రెడ్డి వంటివారు ప్రయత్నిస్తూనే ఉంటారు.

సభికుల్లో భార్య ఉన్నట్లయితే - తన గొప్పతనాన్ని ఇంట్లో తెలియజేయడానికి ఆస్కారమివ్వని ఆ భార్యకు బైట తనకెంత గణ్యత ఉందో, తనకెంత



విజ్ఞానం ఉందో పరోక్షంగా తెలిపే అవకాశం వచ్చినందుకు ఉపన్యసించే భర్త రెచ్చిపోతుండడం, అదో మనస్తత్వం.

ఓ సభలో ఓ ప్రముఖుడు ప్రసంగం మొదలుపెట్టాడట. సభలో ఉన్న ఆ వ్యక్తి భార్య నుంచి ఆయనకో చీటీ వచ్చింది. అందులో పెద్ద అక్షరాల్తో "K-I-S-S!" అని ఉంది. పక్కనున్న ప్రముఖుడు ఆశ్చర్యపోయాడు. ఆయన భార్య ఆయన ప్రసంగం ప్రారంభించగానే 'షటప్' అని రాసి పంపిస్తుందట. మరి 'కిస్' అని రాసి పంపించిన భార్య ఆమె భర్త అయిన తన సాటి ఉపన్యాసకుని ఎంత ప్రేమిస్తుందో అని ఆశ్చర్యపోయి అడిగితే, 'కిస్'ను ఆయన వివరించాడట.

'కిస్' అని రాసి పంపించిన తన భార్య అభిప్రాయాన్ని ఇలా వివరించాడా ప్రముఖోపన్యాసకుడు -

"కీప్-ఇట్-షార్ట్-స్టుపిడ్!" అన్నదానికి "కిస్" సూక్ష్మరూపమని!

ఈ జోక్‌ను దర్శకుడు జంధ్యాల ఓ సభలో చెప్పి ఔచిత్యాన్ని అందరికీ గుర్తుచేశారు.

"శోభనం రాత్రి!" అంది హీరోయిన్ - హీరో మాట్లాడే వల్గర్ మాటలకి హీరోయిన్ అలా పవిత్రంగా, నర్మగర్భంగా టెలిగ్రాఫిక్ లాంగ్వేజ్‌లో ఎందుకు జవాబు చెప్తోందో నాకర్థం కాలేదు. అడిగాను - 'అదే వెరైటీ' అన్నాడాయన. అలా కాస్సేపు బూతులు, నీతులూ పొంతన లేకుండా సాగాక తక్కున ఇద్దరూ ఓ కొండ ప్రదేశంలో ప్రత్యక్షమయ్యారు. హీరో జిలుగు సూట్‌లో, హీరోయిన్ బికినీలో ఉన్నారు.

"కచడం చచడం చంచం జిగడం యాయ్యారే మామా!" అని కెవ్వున అరిచింది హీరోయిన్.

"జిలగం చిలగం కలగం పులగం అయ్యారే భామా!" హీరో కూడా తక్కువ తినలేదు - ఆ లెవెల్లోనే అరిచాడు.

ఇంతలో కింద ఉన్న గడ్డిలోంచి గడ్డిపురుగుల్లా ఓ నూటయాభైమంది అబ్బాయిలూ, అమ్మాయిలూ - "ఓ చర్ కూచ్‌కూచ్ ... బాచర్ బాచ్ బాచ్" అని కోరస్‌లో కూస్తూ లేచారు. ఆ తర్వాత వీరంగం వెయ్యడం మొదలెట్టారు.

"అదేం భాష?" అనడిగాన్నేను భయంగా.

"తెలుగే .. పాట బిగినింగ్‌లో అలాంటి మాటలుంటేనే సాంగ్ హిట్టవుతుంది" అన్నాడాయన.

ఆ గుంపంతా హీరో హీరోయిన్ల చుట్టూతా చేరి గాజు పెంకులు తొక్కిన వాళ్ళలా ఎగిరెగిరిపడుతున్నారు.

"ఎవరూ లేని ఏకాంత ప్రదేశం ఇదీ - ఇక్కడ విప్పుకుందామా మనం మదీ" అని పాడడం ప్రారంభించాడు హీరో.

"వెనకాల తిరణాల జనంలా అంతమందుండగా ఎవరూలేని ఏకాంత ప్రదేశం అంటాడేమిటండీ?" అనడిగాన్నేను.

"నిజానికి లిరిక్ ప్రకారం ఎవరూ ఉండకూడదు. కానీ గ్రూప్ డాన్సర్స్ లేందే సాంగ్ నిలబడదు, ఫాన్స్ ఒప్పుకోరు" అన్నాడు రానాగారు.

సాంగ్ నిలబడడమేమిటో అర్థమై చావలేదునాకు.

హీరో హీరోయిన్లు డాన్స్ పేరుతో డ్రిల్ చేశాక, వెనకాల ఉన్న డాన్సర్లు ఉదరాలు, జఘనాలు ఊపిఊపి వదిలాక పాట పూర్తయింది.

తర్వాతి సీన్‌లో హీరో హీరోయిన్‌ని వెంట తీసుకొని ఇంటికొచ్చి తను ఆ పిల్లని ప్రేమించానన్నాడు.

"బాబూ!" అంటూ గొంతుపోయేలా అరుస్తూ, కుట్టుమిషన్‌ని తన్నేస్తూ తల్లి లేచి నిలబడింది. బరబరా బైటకు నడిచి ఎదురింట్లోంచి వరికిణీ - ఓణీలో ఉన్న వదహారేళ్ళ అమ్మాయిని బరబరా ఈడ్చుకొచ్చింది. "దీన్నేం చేస్తావ్‌రా? ఇది నీ మరదలు! నువ్వంటే దీనికి ప్రేమ వరదలు. దీన్ని నీకిచ్చి చేస్తానని దీని తండ్రి చచ్చిపోయేప్పుడు నేను మాటిచ్చాను."

"అమ్మా! నువ్వు గంగ తండ్రికి మాటిచ్చావ్, నేను మంగకి మనసిచ్చాను."

"గంగ శీలవతి, గుణవతి బాబూ!"

"అమ్మా! మంగ శీలవతి, గుణవతి, గర్భవతి కూడానమ్మా!"

"అంటే ...?" అంది తల్లి అనుమానంగా చూస్తూ.

"అవునమ్మా! తొందరపడ్డాను" హీరో పెదిమ కొరికేసుకుంటూ జవాబిచ్చాడు.

"ఛీ! కఠినాత్ముడా! కన్నెపిల్లల కౌమార్యాన్ని కాలరాచే కసాయి కామాంధుడా నా కొడుకు! కన్నబిడ్డే కాలనాగై ఓ కాళరాత్రి కన్నెమొగ్గని కాలరాస్తాడనుకోలేదురా!"

నాకు కళ్ళనీళ్ళొచ్చాయి- ఆవిడ బాధపడ్తున్నందుకు కాదు, అలా 'క' గుణింతం అప్పచెప్తున్నందుకు. పక్కకి చూశాను రామనాథం గారు కళ్లజోడు తీశాడు కళ్ళు తుడుచుకుంటాడేమో అనుకున్నాను - కళ్ళజోడు తుడుచుకున్నాడు.

ఆ తర్వాత హీరో చెల్లి వచ్చింది - "ఛఛ! ఛీఛీ!" అంటూ 'ఛ' గుణింతం వల్లించింది. అటు పిమ్మట హీరో తమ్ముడొచ్చాడు ఇంకో గుణింతం ఏదో అప్పచెప్పాడు. అంతవరకూ ఎర్రటి ఎండకాస్తోంది. ఉన్నట్టుండి పెద్దగాలి, తుఫాను ప్రారంభమయ్యాయి. హీరో గుడిసె ఊగిపోతోంది. అంతా వెర్రిగా అరుస్తున్నారు. హీరో "మంగా!" అని, గంగ "బావా!" అని చెల్లి "అన్నా!" అని, తమ్ముడు "అమ్మా!" అని, తల్లి "దేవుడా!" అని పొలికేకలు పెడ్తున్నారు.

తుఫాను - గాలి హోరు - కుండపోతగా వర్షం - పక్కనున్న నది గట్టు తెగింది. ప్రవాహం ఊరిని ముంచేసింది. ఆ నదిలో ఆ కుటుంబం కొట్టుకుపోయింది.

'పీడాపోయింది!' అనుకున్నాను నేను. కానీ అది పోలేదు.

కిచకిచకిచామని పిట్టల శబ్దంతో సూర్యోదయం. హీరో ఓ నది ఒడ్డున సీరసంగా పడున్నాడు. నీళ్ళు పట్టుకోపడానికి వచ్చిన ఓ పదహారేళ్ళ పిల్ల హీరోని చూసి, ఆ కుండని విసిరేసి, "కుయ్యోమొర్రో!" చించిలాగినా పిచరికార్! పిచరికార్!" అనరుస్తూ పరుగున వచ్చి



హీరోని పక్కకిలాగి ఒళ్ళో పడుకోబెట్టుకుంది.

"ఈ పిల్లా అలాంటి భాషే మాట్లాడుతోంది - మంగకి కజినా?" అనడిగాను.

"కాదు, మంగ ఈ భాష పాటలో మాత్రం వాడింది వెరైటీకోసం. డైలాగ్ మామూలుగానే చెప్పిందికదా! ఈ పిల్ల జింగ - కొండదొర కూతురు. ఇది స్వచ్ఛమైన కొండభాష!" అన్నాడు రానాగారు.

ఇంతలో రంగురంగుల గుడ్డలు కట్టుకున్న వింత మనుషులు కొందరు చేతుల్లో శూలాలు, బల్లేలతో వచ్చారు బిలబిలలాడుతూ. అంతా చేరి హీరోని ఓ కొండ గుహలోకి చేర్చారు. అక్కడ జింగ హీరోకి సకలసపర్యలూ చేసింది. ఇరవై రోజులయినాయన్నట్టుగా జింగ గోడమీద బొగ్గుతో రోజుకో గీత చొప్పున 20 గీతలు గీసింది.

నాకో అనుమానం వచ్చింది - మూడో రోజు హీరో గడ్డానికి కొద్దిగా నీలంరంగు పూశారు. 21వ రోజున కూడా గడ్డం అలాగే ఉంది. "హీరోకి గడ్డం పెరగదా?" అనడిగాను.

"పెరిగితే ఫాన్సొప్పుకోరు. ఎన్నాళ్ళయినా హీరో గడ్డం అలాగే ఉండాల్సిందే!" అన్నాడు రానాగారు.

ఇరవై ఒకటోరోజున కళ్ళువిప్పాడు హీరో. హీరోని చూసి జింగ పెదాలు తెగ కొరికేసుకుంటూ సిగ్గుపడింది. హీరో మెల్లగా లేచాడు, జింగ వైపు మెల్లగా కదిలాడు - మెల్లగా కదిలాడు - తక్కున జింగ జాకెట్ హుక్స్ తెగేలా కావలించుకున్నాడు.

కమిటైన గంగని చేసుకుంటాడా?

కడుపు నింపిన మంగని చేసుకుంటాడా??

కావలించుకున్న జింగని చేసుకుంటాడా???

'విరామం' అని తెరమీద పడింది. లైట్లు వెలిగాయి. రామనాథంగారు పిలిచి ఫ్రీగా చూపిస్తున్న సినిమా చూస్తున్న కొందరు ఔత్సాహికులు కుర్చీలమీంచి కప్పల్లా గెంతుకుంటూ వెనక్కొచ్చి "25 వారాలు గ్యారెంటీ!", "రేపే పీల్డ్‌స్‌కి ఆర్డరిచ్చేయొచ్చు". అని గావుకేకలేస్తూ రామనాథంగారికి షేక్‌హాండ్లిస్తున్నారు. నేను మెల్లిగా లేచి బైటికొచ్చాను. ఓ బెటాలియన్ సైన్యం తుపాకులు పారేసి సుత్తులు పుచ్చుకుని ఓ పక్షం రోజులు నిర్విరామంగా నాతలమీద మోదేసిన ఫీలింగొచ్చింది నాకు. బైట ఓ టేబిల్‌మీద కాఫీలు, టీలు

అందంగా అమర్చి ఉన్నాయి. "సర్ కాఫీ ఆర్ టీ"? అని వినయంగా అడిగాడు స్టివార్డ్. నాకేమిటోగా అనిపించింది. కా... కాఫీ అయితే ... కారంగా ఉంటుంది... మింగలేను... టీ...టీ...టీ అయితే గట్టిగా ఉంటుంది నమల్లేను అని గొణుక్కుంటూ ప్రక్క కెళ్లాను. అక్కడ లావెటరీ కనిపించింది. లోపలికెళ్లాను. ఏం చెయ్యాలో తోచలేదు. అక్కడున్న వాష్‌బేసిన్ పంపు తిప్పి నీళ్ళు తాగేశాను. పొల్యూషన్ భయంవల్ల - ఇండియాకొస్తే బిస్లరీ నీళ్లు తప్ప ముట్టుకోని నేను ఆ సినిమా ప్రభావం వల్ల లావెటరీ వాష్ బేసిన్ నీళ్లు తాగేశాన్సర్... ఆ తర్వాత అక్కడే కూలబడి పోయాను. కాసేపటికి రామనాథంగారో ఎవరో వచ్చి లేపుకెళ్లారు.

మళ్ళీ దీపాలారాయి - బొమ్మపడింది.ఆ తర్వాత నాకేమీ సరిగ్గా అర్థం కాలేదు సార్... టైఫాయిడ్ జ్వరం వచ్చినట్టనిపించింది. మధ్యమధ్యలో కొన్ని బొమ్మలు కనిపించడం మొదలెట్టాయి.

తక్కున హీరో, జింగా సింగపూర్‌లో కనిపించారు.

"దిస్ ఈస్ సింగపూర్

• అవర్ కంట్రీ ఈజ్‌పూర్" అని ఇంగ్లీష్‌లో పాడ్తోంది జింగ—

"ఇదేమిటండీ - సరిగ్గా తెలుగుమాట్లాడే మంగ "కచడం చచడం చంచం జిగడం" అనిపాడింది, అసలు తెలుగుభాషే రాని జింగ ఇంగ్లీష్‌లో పాడ్తోంది" భయంగా గుటకేస్తూ అడిగాను.

"వాళ్ళు మాటలు ఎలా మాట్లాడినా, పాటలు ఇలాగే పాడాలి - అదే వైరైటీ" అన్నారు రామనాథంగారు ముసిముసిగా నవ్వుతూ. ఆ తర్వాత ఎందుకో నాకు తెలియదుగాని... రాక్షసబల్లులు, ఉరాంగ్ టాంగులు పొట్లాడుకుంటున్నట్లు, చీమ ఏనుగుతో ముష్టి యుద్ధం చేసి చంపేసినట్లు, ఎలిక కుక్కముందు విస్తరేసి అన్నం పెడుతున్నట్లు, పాము క్యాబరేడాన్స్ చేస్తున్నట్లు – ఇలాంటి హెలూసినేషన్స్ వచ్చాయి సర్!

ఎలా కలిశారో తెలీదుగాని, ముగ్గురు అమ్మాయిలూ ఓచోట కలిశారు - హీరోని సెంటర్లో పెట్టి కాస్సేపు ఫుట్‌బాల్ ఆడుకున్నారు. ఆ తర్వాత వీడునావాడు, కాదు నావాడు అని కాస్సేపు పాడుకున్నారు. ఇంతలో ఆ కొంపల్లో మల్లెపూలు అమ్ముకుంటూ తల్లి కనిపించింది. చెగోడీలు అమ్ముకుంటూ తమ్ముడు వెలిశాడు.ముగ్గు అమ్ముకుంటూ చెల్లి ప్రత్యక్షమైంది. హీరో ఆ ముగ్గుర్నీ చూశాడు. కానీ, ఎందుకో సరిగా గుర్తుపట్టలేకపోయాడు. ఏదో అనుమానం... తల్లికీ అనుమానమే. చివరికి ఓ రోజున హీరో వందిని కాలుస్తుంటే దూరంగా నిలబడి కన్నీళ్ళతో, వెక్కిళ్ళతో "ఎ... బి... సి... డి... ఇ... ఇది ఇంగ్లీష్షు" అని పాడింది.హీరో కళ్ళలో నీళ్ళు! "ఇ... ఇ... ఇ... ఈ... హిది త్వెలుగ్గు" అని పాడాడు పెదిమలు వణుకుతూండగా. వెంటనే చెల్లి ముగ్గుబుట్టపారేసి "హ్యాతేహై... జ్యాతెహై... హ్యాండీ" అనరుస్తూ జంప్‌లు చేస్తూ వచ్చింది. తదువరి తమ్ముడు అమ్మే చేగోడీలని తనే ఆనందంతో నమిలేస్తూ "ఇ్యంగ్లెష్హా... ఇంగ్లెష్హో - ష్హరవ్వం"అని గొంతు చించుకుంటూ స్ప్రింగు మింగిన చింపాంజీ పిల్లలా పిల్లిమొగ్గలేస్తూ వచ్చాడు - అంతా ఎముకలు పటపటమనేలా కావలించుకున్నారు.

నా. కళ్ళనించి ధారా ప్రవాహంలా కన్నీళ్ళు - ఆ కన్నీళ్ళ వెనకనించి "పిక్చర్‌లో ఫ్యామిలీసాంగ్ పెడితే ఇదే ఎడ్వాంటేజ్ - కుటుంబాన్ని కలుపుతుందని" అంటున్న రానాగారు మసకమసగ్గా కనిపించాడు. ఇంకాస్సేపటికి జరిగిన కథంతా తెలుసుకున్న జింగ కొండ మీంచి దూకేసింది త్యాగరాణిలా. గంగ అస్తమిస్తున్న సూర్యుడివైపు నడిచెళ్ళిపోయింది. హీరో, మంగ కావలించుకున్నారు. తెరనిండా లక్షల లక్షల జామకాయలు. ఆ గుట్టలోంచి పడుతూ లేస్తూ పైకొచ్చిన హీరో, మంగ గెంతడం ప్రారంభించారు కచడం, చచడం చంచం జిగడం హెయ్యారే మామా!

"జిలగం చిలగం కలగం పులగం అయ్యారే భామా! అనుకుంటూ. తెరమీద శుభం అనే పడిందేమో నాకు మాత్రం భశుంలాగా కనిపించింది. "ఎలాఉందల్లుడుగారూ పిక్చరు?" అని మురిసిపోతూ అడుగుతున్న రామనాథంగారు నా కళ్ళకి హిరోషిమా మీద అణుబాంబు విసిరేసిన విమానం పైలట్‌లా కనిపించాడు. ఇరాక్‌లోని ముక్కుపచ్చలారని ముద్దుపావల దౌర్భాగ్యపు చావుకి కారకుడైన సద్దాంహుస్సేన్‌లా అనిపించాడు. ఊచి పుచ్చుకుని దవడపేలేలా ఒక్కటిచ్చాను - అవాక్కయిపోయాడాయన.

"కచడం చచడం చంచం జిగడం హయ్యారే మామా" అని పెద్దగా పాడుకుంటూ లాంగ్‌జంప్‌లు, పోల్‌వాల్ట్‌లూ వేస్తూ పెళ్లిపందిరి దగ్గరికెళ్ళాను - ఆ పందిరి పీకిపడేశాను. అడ్డొచ్చిన వాళ్ళని కొరికేశాను. మధ్యలో ఫ్యామిలీసాంగ్ గుర్తొచ్చింది. "ఎబిసిడిఇఎఫ్ ఇది ఇంగ్లీమ" అని పాడుతూ ఓ గంటన్నర వీరవిహారంచేసి అందర్నీ ఎడాపెడా బాదేసి వంటగదిలో రెడీగా ఉన్న సాంబార్ తాగేసి పక్కనున్న ఎలక్ట్రిక్ పోల్ ఎక్కి దానికి ఉన్న అడ్డ కడ్డీమీద కూర్చొని నిద్రపోయాను సార్ - సర్వీస్‌లో ఎందరో పిచ్చివాళ్ళకి వైద్యంచేసి వాళ్ళ పిచ్చి నయంచేసిన ఫేమస్ సైకియాట్రిస్ట్‌ని... ఆ రోజు నేనెందుకలా ఎబ్‌నార్మల్‌గా బిహేవ్ చేశానో నాకు అంతు చిక్కడంలేదు సార్... యువరానర్ - జరిగింది ఇది. న్యాయం మీరే నిర్ణయించండి" అని ఆగాడు ఆ కుర్రాడు.

నిశ్శబ్దం....

నిశ్శబ్దం....

అంతా రెప్పవాల్చకుండా జడ్జిగారి వైపు చూస్తున్నారు...

గంభీరంగా చూస్తున్న జడ్జిగారి మొహంలో కుంభవృష్టి కురిసి వెలిశాక మెరిసే లేత ఎండలా చిరునవ్వు.

ఆ నవ్వు చలికాలంలో హైదరాబాద్‌లోని ఎండలా కొద్దిగా పెరిగింది.

ఆ తర్వాత వేసవికాలంలో బెజవాడలోని ఎండలా ఉధృతమైంది.

జడ్జిగారు లేచి నిలబడ్డారు. తప్పున నవ్వు ఆపారు - వెంటనే కన్నీళ్లు పెట్టుకుని నల్లగౌను వేలాడే చేతులతో తుడుచుకున్నారు.

"భటుడా! గుర్రం తెప్పించు - బార్బర్ షాపుకెళ్ళి అర్చన చేసుకొస్తాను" అంటూ బావురు కప్పలా గెంతుతూ నిష్క్రమించారు!

నల్లకోటుల కోర్టు తెల్లబోయింది!

ఇంక ఎవరు తీర్పు చెప్పగలరు?

రామనాథంగారు తీసిన సినిమా మంచిదో కాదో ఎవరు తేల్చగలరు?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మంచి సినిమా'కి పదిహేను లక్షలు ప్రకటించిన నేపథ్యంలో ఏది మంచి సినిమానో ఎవరు నిర్ధారించగలరు???

*[నువ్వు పెద్ద పొడిచేసే సినిమాలు తీశావా అని నీలాపనిందలు వేయకండి. నేను ఈ తానులో గుడ్డనే గనక అనుభవం వల్ల రాశానిది... ఏమైనా... ఇది ఎవరినీ, ఏ వ్యవస్థనీ నొప్పించడానికి రాసినది కాదని మనవి - దీన్ని చదివి కాస్సేపు నవ్వుకుంటే... అదే ఆరోగ్యం! – జంధ్యాల]*

## ఎన్.టి.ఆర్ 'లాఠీఛార్జీ'

'మనదేశం' (1949)లో ఎన్.టి.ఆర్.కు సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర ధరించే అవకాశం కల్పించి, ఆవిధంగా ఆయన చిత్రరంగ ప్రవేశానికి దోహదంచేశారు ఎల్.వి.ప్రసాద్. ఆ చిత్రంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కాంగ్రెస్ కార్యకర్తలపై లాఠీఛార్జీ చేసే సన్నివేశం ఒకటి ఉంది. ఎన్.టి.ఆర్. ఎస్.ఐ. గెటప్‌లో లాఠీ పట్టుకుని వచ్చారు. జూనియర్ ఆర్టిస్టులు - పోలీసులు, కార్యకర్తల వేషాల్లో సిద్ధంగా ఉన్నారు సన్నివేశ చిత్రీకరణకోసం. ఎల్.వి.ప్రసాద్ సన్నివేశం గురించి ఎన్.టి.ఆర్.కు వివరించి యాక్షన్ అన్నారు.



అంతే... ఎన్.టి.ఆర్. ప్రళయకాల రుద్రుడిలా విజృంభించి కార్యకర్తలమధ్యకు దూకి దొరికినవాణ్ణి దొరికినట్లుగా మూకుమ్మడిగా 'లాఠీచార్జీ' చేయడం ఆరంభించారు. కొన్ని నిమిషాలవరకు ఆ చిత్రీకరణను పర్యవేక్షిస్తున్న ఎల్.వి.ప్రసాద్‌కు నిజంగానే అరుపులు, కేకలు వినిపించేసరికి కంగారుగా చూశారు. అప్పుడు అర్థమైంది ఎన్.టి.ఆర్. నిజంగానే ఆ కార్యకర్తలను బాదుతున్నారని! 'కట్' అన్నా ఆ 'బాదుడు' అలా కొనసాగుతూనే వుంది. అప్పుడు సహాయకులను పంపించి, ఆ 'దౌర్జన్యాన్ని' నిలిపివేశారు. 'ఏమిటండీ ఇది' అని ప్రశ్నిస్తే, "అవునండీ... పోలీసులు లాఠీఛార్జీ ఇలాగే చేస్తారు" అన్నారు ఎన్టీఆర్ అమాయకంగా.

"మరో షాట్ తీద్దాం... ఆ కార్యకర్తలను సమీకరించండి" అన్నారు ప్రసాద్. "ఇంకెక్కడండీ... ఆయన దెబ్బలను తట్టుకోలేక కొందరు ఇళ్ళకీ... మరికొందరు ఆస్పత్రికీ పారిపోయారు" అన్నాడు ప్రొడక్షన్ మేనేజరు ఆయాసపడుతూ వచ్చి!